క్లుప్తంగా

ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా

పీసీపల్లి: సోమవారం జరగాల్సిన పెద అలవల పాడు ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. 4న జరగాల్సిన ఉపసర్పంచ్ ఎన్నికకు సభ్యులెవ్వరూ హాజరు కాలేదు. దీంతో ఈ ఎన్నిక 5న మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గణేషునిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న పి.నాగభూషణాచారి, ఉప్పలపాడు ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్న డి.పున్నమ్మ, చెన్నపునాయునిపల్లి ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్న షేక్.చాంద్‌బాషాలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు.

పామూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా మండలంలోని పుట్టంనాయునిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన గంధం ప్రసాదు ఎన్నికైనట్లు రెండవ ఎంఈఓ కరుణకుమారి తెలిపారు.

ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా శ్రీనివాసులు ఎంపిక



రాచగుండ్ల శ్రీనివాసరావు

కనిగిరి రూరల్: మండలంలోని పాతపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ప్రస్తుత పీసీపల్లి మండల ఎంఈఓ 2 రాచగుండ్ల శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ హెచ్‌ఎం అవార్డుకు ఎంపికయ్యారు. జిల్లాలో ఇద్దరు హెచ్‌ఎంలు అవార్డులకు ఎంపిక కాగా, అందులో శ్రీనివాసరావు ఒకరు. పాతపాడు ప్రధానోపాధ్యయునిగా ఆర్ శ్రీనివాసరావు పాఠశాల అభివృద్ధికి దాతల, తన వంతు ఆర్థిక సహకారంతో మౌలిక వసతులు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పది పరీక్షా ఫలితాల్లో పాతపాడు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు. జిల్లా ఉత్తమ హెచ్‌ఎంగా ఎంపికైన రాచగుండ్ల శ్రీనివాసరావును సోమవారం జిల్లా ఎంఈఓల సంఘ కార్యదర్శి దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు ఉడుముల నారాయణరెడ్డి, రాజాల కొండారెడ్డి, ద్వారశీల ప్రసాద్‌రెడ్డి, సంజీవిలు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ

ఉలవపాడు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరుగుతున్న మధ్యాహ్న భోజనాన్ని కందుకూరు డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ పీవీ రమణయ్య , ప్రధానోపాధ్యాయుడు శివనాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.




అమ్మవారి నూతన విగ్రహం వద్ద దిష్టి గుమ్మడికాయ కొడుతున్న ఎమ్మెల్యే



వేడుకలను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

ఉత్సవాలకు అంకురార్పణ

- వైభవంగా ప్రారంభమైన అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు
- కన్నులపండుగగా అమ్మవారి గ్రామోత్సవం
- అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి నూతన విగ్రహం



హనుమాన్ చాలీసా పఠిస్తున్న మహిళలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి నూతన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ఉదయం ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణంతో ప్రారంభమై, సాయంత్రం అమ్మవారి నూతన విగ్రహ గ్రామోత్సవం శోభాయమానంగా సాగింది. గ్రామోత్సవానికి ముందు అమ్మవారి విగ్రహానికి పూజార్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమై, పోస్టాఫీస్ సెంటర్,



గ్రామోత్సవంలో అమ్మవారు

అంబేడ్కర్ బొమ్మ సెంటర్, చర్చిసెంటర్, పాతబ్యాంకు బజార్, పొట్టి శ్రీరాములు బొమ్మసెంటర్, పెద్దబజార్, పోతురాజుస్వామి దేవస్థానం, గుర్రంవారిపాలెం, పామూరు రోడ్డు జంక్షన్, ఎన్‌టీఆర్ బొమ్మసెంటర్, విప్పగుంట రోడ్డు, చాకవలిపాలెం, బలిజపాలెం, రూరల్ పోలీస్‌స్టేషన్ మీదుగా తిరిగి అమ్మవారి దేవాలయం వరకు సాగింది. పట్టణంలో సాగిన గ్రామోత్సవ యాత్ర మేళతాళాలు, తప్పెట్లు, కోలాటాలు, బాణసంచా వెలుగుల మధ్య శోభాయమానంగా సాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణంలో తిరునాళ్ల వాతావరణం నెలొకంది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం యజ్ఞశాల ప్రారంభం కానుంది. వేదపండితులు, రుత్వికులు యజ్ఞయాగాలు, హోమాలు నేటి నుంచి నిర్వహించనున్నారు. ఇవి రెండు రోజులపాటు నిరంతరాయంగా సాగనున్నాయి. అనంతరం గురువారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించనున్నారు.

వేడుకలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే

అమ్మవారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవ వేడుకలను ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఆద్యంతం దగ్గరుండి పర్యవేక్షించారు. పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. అలాగే భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా, ప్రతి ఒక్కరూ అమ్మవారిని ప్రశాంతంగా దర్శించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు.

నూతన పింఛన్లు మంజూరు

వలేటివారిపాలెం(లింగసముద్రం): లింగసముద్రం మండలానికి 270 నూతన పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ శేషుబాబు తెలిపారు. ఎంపిక చేసిన వారిలో 120 మందికి ఈ నెల 1వ తేదీ పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన 150 మందికి 5వ తేదీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

వలేటివారిపాలెం: మండలంలోని నేకూనాంపురం పంచాయతీలో నూతనంగా పింఛన్లు మంజూరైన వారికి సోమవారం పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉషారాణి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ వితరణ

వలేటివారిపాలెం(లింగసముద్రం): లింగసముద్రం మండలంలోని పెంట్రాల మండల ప్రజా పరిషత్ పాఠశాలకు పూర్వ విద్యార్థి బోడి కల్కేశ్వరావు రూ.20 వేల విలువైన మైక్ సెట్‌ను విరాళంగా అందజేశారు. అలాగే పూర్వ విద్యార్థులతో కలిసి పాఠశాలలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కల్కేశ్వరరావును ఎంపీపీ పి.కృష్ణయ్య, ఎంఈఓ శివకుమార్, హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు సత్కరించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌ఏ గౌస్ మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గ్రామాల్లో ప్రజాజాత నిర్వహించామన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు ఎస్‌కే మున్వర్‌సుల్తానా, టి. వెంకట్రావ్, పద్మ, ఎస్ పవన్‌కుమార్, డీఎం రాయుడు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నేతలు

ఉలవపాడు: మండల పరిధిలో గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కుమార్ అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఆయన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఎం మండల నాయకులు గౌస్‌భాషా, కొమరగిరి వెంకటేశ్వర్లు, నాగార్జున, శేషమ్మ, జహార్, యలమందమ్మ, లక్ష్మి, నాగమ్మ, అనసూయమ్మ పాల్గొన్నారు.

పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలి



ఏలూరుపాడులో పోషణ మహా గురించి వివరిస్తున్న కామేశ్వరి

గుడ్లూరు: గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే బిడ్డలతో పాటు తల్లులు కూడా ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ తెట్టు సెక్టార్ సూపర్‌వైజర్ కామేశ్వరీ అన్నారు. పౌష్టకాహారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఏలూరుపాడులో సోమవారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కామేశ్వరీ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఆహారంను తీసుకోవాలన్నారు. సర్పంచ్ చెన్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

గుడ్లూరు: మండలంలోని దారకానిపాడులో ఉన్న రామాలయంలో సీతారామ లక్ష్మణ నూతన శిలా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. గత మూడు రోజులు నుంచి విగ్రహాల ప్రతిష్టా మహోత్సవానికి సంబంధించి పూజలు, హోమాలను వేద పండితులు నిర్వహించారు. సోమవారం చివరి రోజు నూతన విగ్రహాలను ఆలయంలో వేద పండితుల వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారామ లక్ష్మణ నూతన విగ్రహాలను ప్రతిష్ట చేశారు. అనంతరం అన్నదానం చేశారు.



నూతనంగా ప్రతిష్ఠించిన సీతారామ లక్ష్మణశిలా విగ్రహాలు

రైతులు కంది సాగు చేసుకోవచ్చు



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ వెంకటరమణ

కనిగిరి రూరల్: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు భూమి పదునైందని, రైతులు కంది సాగు చేసుకోవాలని ఏడీఏ ఈ వెంకట రమణ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శని, ఆదివారాల్లో 148.18 మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపారు. కంది సాగుచేసే రైతులు విత్తనం, విత్తనానికి మధ్య దూరం 90 సెంటిమీటర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎకరానికి 4 లేదా 5 కేజీల విత్తనాలు వేసుకోవాలన్నారు. ఈ నెల నుంచి అక్టోబర్ మొదటి వారం వరకు అలసంద, మినుము పైర్లను విత్తుకోవచ్చని తెలిపారు. మినుము విత్తనాలు పీయూ 31. టీబీజీ -104 రకాలను సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాల్లో తీసుకోవచ్చని చెప్పారు. రైతులకు కావాల్సిన ఎరువులు, కాంప్లెక్స్ ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అనంతరం వివిధ ప్రాంతాల్లోని రైతులకు కంది సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ శిల్ప, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి క్షేత్ర స్థాయి పర్యటనలు



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే క్షేత్ర స్థాయిలో వార్డు పర్యటనలను చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో సోమవారం సమస్య పరిష్కారం కార్యక్రమంలో భాగంగా చైర్మన్ గఫార్, కౌన్సిలర్ కరీమున్ ఖాశింసాతో కలిసి పర్యటించారు. స్థానికులు వార్డులో నీరు, పారిశుధ్యం తదితర సమస్యలను విన్నవించారు. వార్డుల్లో పారిశుధ్య పనులు, నీటి సమస్యలపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని శానిటరీ అధికారులను, వాటర్‌లైన్ సిబ్బందిని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్లల్లో నుంచి వచ్చే చెత్త చెదారాన్ని రోడ్లపై, కాలువల్లో వేయకుండా మున్సిపల్ కార్మికులకు అందచేయాలని, లేదా మున్సిపల్ చెత్త రిక్షాలో వేయాలని సూచించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖాజా, కన్వీనర్ ఎస్‌కే ప్యారీజాన్, మన్సూర్, శానిటరీ సెక్రటరీ నాగజ్యోతి, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు నాయబ్ రసూల్, సోఫా జిలాని తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీల్లో అవకతవలకు పాల్పడితే చర్యలు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రేషన్ పంపిణీలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడితే శాఖపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. మొబైల్ వాహనాల ద్వారా రేషన్ పంపిణీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడినా, నిబంధనల ప్రకారం బియ్యం, రేషన్ సరుకులు అందచేయకపోయినా ఉపేక్షించేది లేదన్నారు. కొలతల్లో తేడాలు చేసిన, కార్డుదారులను ఇబ్బంది పెట్టిన ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. కౌన్సిలర్ కరీమున్ ఖాశింసా, కోఆప్షన్ సభ్యుడు ఖాజా, కన్వీనర్ మన్సూర్, వార్డు నాయకులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.2 లక్షలు



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న భక్తులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి రూ.2,00,072 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జి.రమణారెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణలు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.81,270, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.30,220, ఆలయం వద్ద నిర్మిస్తున్న మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ..25,116, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.39,446, ఇతర విరాళాల ద్వారా రూ.24 వేలు వచ్చినట్లు ఈఓ, చైర్మన్ తెలిపారు. నాయకులు కొమ్మినేని వెంకట్రావు, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాల వెల్లువ



విరాళం అందజేస్తున్న భక్తులు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లికి సోమవారం భక్తుల నుంచి భారీ స్థాయిలో విరాళాలు వెల్లువెత్తాయి. భక్తులు పెద్ద సంఖ్యలో సోమవారం ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో విరాళాలు ఆలయ కమిటీకి అందజేశారు. చిలకా చంద్రమౌళి, రాజేశ్వరి దంపతులు రూ.1,00,116, కె.సత్యన్నారాయణరెడ్డి, నిర్మలాదేవి రూ.1,00,000, కె.కోటేశ్వరరావు, ఉషారాణిలు రూ.25,116, అంకమరాజు, సుజాతలు రూ.25,116, మల్లిఖార్జునస్వామి, లక్ష్మీరాజ్యం రూ.51,116, తాటికొండ మధుబాబు, రాధికలు రూ.25,116, వెంకట రంగారావు, మీనాక్షిలు రూ.35,116, చింతలచెరువు రామకృష్ణారావు, వెంకట ఉషాచంద్రిక రూ.25,116, గంగవరపు వెంకట్రావ్, సునంద దంపతులు రూ. 25,116, కుమ్మర బ్రహ్మయ్య రూ.12,500, మోసంగి కోటేశ్వరరావు, భాగ్యమ్మలు రూ. 25,116, సురేంద్రబాబు, వెంకటదీప్తిలు రూ.12,516 అందజేశారు. వీరితో పాటు మరికొందరు విరాళాలు అందజేశారు. విరాళాలు ఇచ్చిన భక్తులకు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.


రైతులకు తోడ్పాటు అందించాలి



పీడీసీసీ బ్యాంక్ చైర్మన్‌ని సన్మానిస్తున్న నాయకులు

టంగుటూరు: రైతులకు అన్ని విధాలా తోడ్పాటు అందించాలని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డిని కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర కోరారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. వైఎస్సార్ సెల్ నాయకులు కొమ్ము కోటేశ్వరరావు, చింతం చైతన్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్రం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

పామూరు: కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించి పారిశ్రామికవేత్తలకు కొమ్ముకాస్తుందని సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరసిస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఎ.సురేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సయ్యద్ గౌస్‌బాషా, అల్లాభక్షు, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఖాసీంసాహెబ్, జి.భానుమతి, ఖాదరున్నీసా, అంకమ్మ, జయరావు పాల్గొన్నారు.

స్పందనకు 14 వినతులు



అర్జీలు తీసుకుంటున్న ఆర్డీఓ అజయ్‌కుమార్

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనకు 14 అర్జీలు వచ్చాయి. కనిగిరి మండలం నుంచి 7, కేకేమిట్ల 2, హెచ్‌ఎంపాడు 2, వెలిగండ్ల 1, మర్రిపూడి 1, పామూరు నుంచి ఒక అర్జీ ఆర్డీఓ అజయ్‌కుమార్‌కు అందజేసినట్లు స్పందన వీఆర్‌ఓ రఘురామయ్య తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ అజయ్‌కుమార్ అన్నారు. డీఏఓ జయవర్ధన్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో ఘర్షణ

- అట్రాసిటీ కేసు నమోదు

హనుమంతునిపాడు: పాత గొడవలను మనసులో పెట్టుకొని ఘర్షణ పడగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే..రక్షణాపురం ఎస్సీ కాలనీకి చెందిన కొదమల నాగేసు, కొదమల ఇస్మాయేలు వేములపాడు సెంటర్‌కు వచ్చారు. అక్కడే ఉన్న వెన్నపూసల రమణయ్య, వెన్నపూసల ఏడుకొండలు పాత కక్షలుమనసులో పెట్టుకొని వారిపై వాదనకు దిగి గొడవకు దిగారు. వారితో పాటు మరో 8 మంది వచ్చి కర్రలు, ఇనుప పైపులతో దాడి చేశారు. గాయపడిన వారు కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు రమణయ్య, ఏడుకొండలతో పాటు 8 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివనాగరాజు తెలిపారు.

ఇద్దరికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



గవిని శివశంకర్



ముప్పరాజు వీరయ్య

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని ముప్పవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న గవిని శివశంకర్, మిట్టపాలెం హెచ్‌పీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ముప్పరాజు వీరయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

నిబద్ధతతో పనిచేస్తే తగిన గుర్తింపు

పీసీపల్లి: నిబద్ధతతో పనిచేస్తే ఎక్కడైనా తగిన గుర్తింపు వస్తుందని విద్యా కమిటీ చైర్మన్ ఎం నరసింహ అన్నారు. మండలంలోని పెదవరిమడుగు నుంచి బదిలీపై వెళ్తున్న సీహెచ్ అరుణకు సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులరెడ్డి, ఎంఈఓ సంజీవి, శ్రీనివాసులు, హెచ్‌ఎం ఎలిజిబెత్ రాణి, ఉపాధ్యాయులు ఏసుబాబు, పోతులూరయ్య, శ్రీవేణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

దర్శి: మండలంలోని తుమ్మెదలపాడు గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.